క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం



అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: యర్రంపేటలో అగ్నిప్రమాదం సంభవించి నిరాశ్రయులైన రెండు కుటుంబాలకు గురువారం దాతలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విగ్గిన రామకృష్ణ, బోగళ్ల రాఘవులు, రాఘవరావు సాయి, ఉస్సే బాబూరావు, చింతలపూడి కిషోర్, తదితరులు రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు ముంగమూరి నాగేశ్వరరావు, మంగమూరి పెద్దిరాజు కుటుంబాలకు అందజేశారు. అదే విధంగా కొయ్యలగూడెం మానవతా సంస్థ సభ్యులు బాధితులకు రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు వేరువేరుగా గురువారం రూ.2,50,116 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ద్వారకాతిరుమలకు చెందిన కొమ్మన త్రిమూర్తులు రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన అద్దంకి శివరామ ప్రసాద్ రూ.1,50,000 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామి వారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు



ముమ్మరంగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. గురువారం ఉదయం 10:30 గంటలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, ఇంజనీర్ రామచంద్రరాజు, ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు, గిరి ప్రదక్షిణరహదారి దాత మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పర్యవేక్షణలో పనులు నిర్వహించారు. రెండు జేసీబీలతో స్వామి వారి ఉత్తర ఈశాన్యం రోడ్డు పనులను ప్రారంభించారు. దాతల సహకారంతో గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామికి భస్మాభిషేకం చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాలు రెండో రోజు వైభవంగా నిర్వహించారు. వీరంకి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పునఃపూజలు, విశేష చండీహోమం, అయ్యప్ప స్వామిక విశేషంగా మహన్యాసపూర్వక అష్టాభిషేకం, భస్మాభిషేకం, కనకాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో శాశ్వత కమిటీ చైర్మన్ కేసరి రామిరెడ్డి, ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, సెక్రెటరీ గంగు జగన్‌మోహన్‌రెడ్డి, కూన పార్వతి, తమ్మన వెంకటేశ్వరరావు నెక్కలపూడి సూర్యచంద్రరావు, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లిపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు, పోలు మాల్యాద్రిరెడ్డి, బాకి శ్రీనివాస్ రెడ్డి, పందిరిపల్లి అంజనీ కుమార్ పాల్గొన్నారు.

నేడు పూలే విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వెలగల దుర్గారావు పేర్కొన్నారు. కన్నాపురం రోడ్‌లోని లైబ్రరీ వద్ద పునః ప్రతిష్టించిన పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను బీసీ నేతలు పర్యవేక్షించారు. జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ ముప్పిడి విజయకుమారి హాజరవుతున్నట్లు తెలిపారు. దారం సత్తిరాజు, రాచూరి మదన్, వీరవరపు నివాస్, చిటికెన రమేష్, మారిశెట్టి శ్రీను, బూసి త్రిమూర్తులు, జి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

- వేసవిలో పశువులను సంరక్షించాలి
- మూగ జీవాలకు వడదెబ్బ తగలకుండా చూడాలి
- పాడి రైతులకు వైద్యుల సూచన



మంచినీటి తొట్టెలో నీరు తాగుతున్న పశువులు



వేసవి ఎండలో మేతకు వెళుతున్న పశువులు

బుట్టాయగూడెం: వేసవిలో పశు పోషకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. రోజు రోజుకూ ఎండలు మండిపోతున్నాయి. తీవ్రమైన ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మనుషుల పరిస్థితి ఇలా ఉంటే ఇక పశువుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయితే వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు రకరకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18–35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు పశువులకు సౌకర్యంగానే ఉంటాయి. ఆపై ఉష్ణోగ్రతలు అధికంగా నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని పశువైద్యులు చెబుతున్నారు. వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశం కూడా ఉంది. వేసవిలో పాడి రైతులు ప్రత్యేక మెలకువలు పాటించాలి. అదే విధంగా పశువులకు వేసవిలో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు అంటున్నారు. పశువులకు వేసవి కాలంలో కావాల్సినంత మేత దొరకదు. దీని వలన పశువులు రకరకాల సమస్యలను ఎదుర్కొంటాయి. ఈ క్రమంలో పాడి రైతులు పశువుల సంరక్షణపై జాగ్రత్తలు పాటించాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా..

పశువులను మేత కోసం అడవుల్లోకి, పొలాల్లోకి తీసుకెళ్తారు. వేసవిలో ఇలా చేయడం వలన పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయం ఎండలోనే ఉండడం, తాగునీరు పూర్తి స్థాయిలో లభించకపోవడం వలన తీవ్ర అస్వస్థతకు గురవుతాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడీ వేగం బాగా పెరుగుతుంది. చెమటలు ఎక్కువగా పడుతుంటాయి. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. పశువుల్లో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించి వాటిని చల్లని ప్రదేశానికి లేదా షెడ్‌లోకి తీసుకెళ్లాలి. అలాగే పశువులను చల్లని శుభ్రమైన నీటితో కడగాలి. తాగినంత నీరు పట్టించి, ప్రాథమిక చికిత్స అందించాలి. ప్రధానంగా ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య కాలంలోనే పశువులను మేతకు తోలుకెళ్లాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

నీరు, ఆహారం అధికంగా అందించాలి



వేసవిలో పశువులు మేతను తక్కువగా తీసుకొని, నీటిని ఎక్కువగా తాగుతాయి. పశువులు తాగే నీరు పుష్కలంగా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో ఉండాలి. ఆహారం విషయంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి పూట పచ్చగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి రాత్రి ఎండుగట్టి పెట్టాలి. పగలు ఎండుగడ్డి పెడితే పశువులు నీరు ఎక్కువగా తీసుకొని మేత తక్కువ తింటాయి. దీని వలన అవి నీరసించిపోయే ప్రమాదం ఉంది.

–డాక్టర్ మల్లంపల్లి సాయి బుచ్చారావు, సహాయ సంచాలకులు, పశువర్థక శాఖ, జీలుగుమిల్లి

బెదిరింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఏఎన్ఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆర్.సత్యవతి జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటూ పెనుగొండలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 5వ తేదీ రాత్రి 11.30 గంటలకు సత్యవతి ఇంట్లో ఉన్న సమయంలో మొడియం కుమార్, మరో వ్యక్తి వచ్చి తలుపులు తీయమని గొడవ చేశారన్నారు. దీంతో భయపడిన సత్యవతి తెలిసిన కార్ డ్రైవర్‌కు ఫోన్ చేయగా తన స్నేహితులతో కలిసి సత్యవతి ఇంటికి వచ్చాడు. అప్పటికే కుమార్, మరో వ్యక్తి సత్యవతిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. కార్ డ్రైవర్, అతడితో వచ్చిన వారిని చూసి కుమార్, మరో వ్యక్తి పారిపోయారని తెలిపారు. ఏఎన్ఎం సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలిస్తున్న స్థానికులు

కొయ్యలగూడెం: మండలంలోని పొంగుటూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సమీపంలో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న కారును కొయ్యలగూడెం వైపు వస్తున్న బైక్ వేగంగా ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ సమయంలో కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయితే బైక్ మీద ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు అవడంతో స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్‌ను కోరారు. గురువారం బుట్టాయగూడెంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే నరసయ్య పీఓను కరాటం సాయి చంద్రమోహన్ ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలని కోరారు. సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని పీఓ చెప్పారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్, జి.ప్రభాకర్, జాటోతు కృష్ణ, కట్టం వీరాస్వామి, ఎస్‌కే మున్నీ పాల్గొన్నారు.

లక్ష్మీ సరోజారెడ్డికి బహుమతి



జంగారెడ్డిగూడెం: ఉగాది సందర్భంగా చివటం సంగీత సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీ సరోజారెడ్డికి బహుమతి లభించింది. బహుమతిని కళా వేదిక నిర్వాహకురాలు గుండాల గీతామహాలక్ష్మి చేతుల మీదుగా అందుకున్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన



జంగారెడ్డిగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆర్‌వీ రమణ



పోలవరం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

జంగారెడ్డిగూడెం: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వారి ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆర్డీవో ఆర్‌వీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. మండలంలోని పంగిడిగూడెం, పేరంపేట, గుర్వాయిగూడెం, లక్కవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై గురువారం తహసీల్దార్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన రేటు అనగా క్వింటా ధాన్యమును రూ.2300 అమ్ముకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అవసరమైన గోనె సంచులను రవాణా చేస్తామన్నారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణికాల ప్రకారం ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. లక్కవరంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పోలవరం రూరల్: గూటాల–2 రైతుసేవా కేంద్రంలో గురువారం రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు మాట్లాడుతూ కొత్తపట్టిసీమ గ్రామంలో 867 ఎకరాలగానూ, 3467 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం 62 వేల గోనె సంచులు కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ పంట నమోదులో ఈకేవైసీ పూర్తైనరైతులు మాత్రమే దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చన్నారు. ధాన్యం అమ్మిన రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటామన్నారు. రైతులకు ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1967 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 7702003584 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, కొణతాల ప్రసాద్, మైగాపుల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణకు మాజీ ఎమ్మెల్యే నివాళులు



రాధాకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా నాయకులు కొల్లూరి దినేష్ తండ్రి రాధాకృష్ణ సంస్మరణ కార్యక్రమం మండలంలోని రెడ్డిగణపవరంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాములునాయక్

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఐటీడీఏ పీఓ కె.రాములునాయక్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరులో పౌష్టికాహార పక్షోత్సవాలు, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ప్రదర్శన, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మబంధువులం స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, స్వీట్లను పీఓ పిల్లలకు పంచారు. కార్యక్రమంలో సీడీపీఓ ఏలూరు తులసి, న్యాయవాది యు.ఏసుబాబు, సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రాజు, సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, ఏఎన్ఎం చెల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రహదారి వెంబడి చెట్ల నరికివేత



విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చెట్లను నరికిన అధికారులు



ట్రాక్టర్‌పై తరలిస్తున్న నరికిన చెట్లు

బుట్టాయగూడెం: మండలంలోని మర్లగూడెం నుంచి మార్కండేయపురం వరకూ రహదారి వెంబడి ఉన్న చెట్లను విద్యుత్ వైర్ల ఏర్పాటుకు అడ్డొస్తున్నాయనే నెపంతో ఇష్టానుసారంగా నరికి వేశారు. ఈ రహదారి వెంబడి ఇరువైపులా చెట్లు వేసవి కాలంలో ప్రజలకు ఎండ తీవ్రత తెలియకుండా పచ్చదనంతో చల్లని నీడను ఇచ్చేవి. వాటిని ప్రస్తుతం నరికి వేయడంతో రహదారి ఒక వైపు బోసుపోయి కనిపిస్తుంది. యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. నరికిన చెట్లను ట్రాక్టర్లపై లోడ్ చేసి తరలిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కేవలం చెట్ల కొమ్మలు మాత్రమే తొలగిస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే చెట్లు నరకడం హత్యకన్నా ఘోరమని ఒక చెట్టును నరికితే రూ.లక్ష జరిమానా విధించాలని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సుప్రీం కోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. అయినప్పటికీ యథేచ్ఛగా చెట్లను నరికి వేయడంపై పలురురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణంలో కొరవడిన నాణ్యత



రకరకాల మెటీరియల్‌తో నిర్మించిన గ్రావెల్ రోడ్డు

కొయ్యలగూడెం: అధికారులు మనవాళ్లు అయితే అడిగే వారు ఎవరున్నారన్నట్లుగా ఉంది కాంట్రాక్టర్లు వేస్తున్న పరింపూడి, కన్నాయిగూడెం గ్రావెల్ రోడ్డు దుస్థితి ఉంది. రెండు గ్రామాల మధ్య సుమారు నాలుగు కిలో మీటర్ల మేర ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.70 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం కొనసాగుతుంది. అనేక సార్లు రైతులు అభ్యంతరాలు తెలిపి పనులను ఆపినప్పటికీ కూటమి నాయకుల ఒత్తిళ్లు, ప్రతి ఘటన చర్యలతో షరా మామూలుగానే రోడ్డు నిర్మాణం కొనసాగుతూపోతుంది. ఈ నేపథ్యంలో నాణ్యత లేని మట్టిని గ్రావెల్ రోడ్డుగా చూపిస్తామంటూ గుత్తేదారులు తమ పనిని లాఘవంగా చేసుకుపోతున్నారు. రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ తాము అచేతనంగా మారామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: ఈ నెల 11వ తేదీ శుక్రవారం జంగారెడ్డిగూడెం మెట్ట మీద సబ్ స్టేషన్ పరిధిలో న్యూ ఫీడర్ వర్క్, సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని కాలేజీ రోడ్డు, సాలిపేట్, జేపీ సెంటర్, శ్రీనివాసపురం రోడ్ ఏరియా, రాజుల కాలనీ, సుబ్బారెడ్డి కాలనీ, అశ్వారావుపేటరోడ్డు, ఉప్పలమెట్ట, అన్ని అగ్రికల్చర్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే కామవరపుకోట నుంచి లక్కవరం సబ్‌స్టేషన్ లైన్ మీద చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం నిమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రాజుపోతేపల్లి, వెలగపాడు, జలపవారిగూడెంలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: స్థానిక సబ్ స్టేషన్ నుంచి వెళ్లే రాజవరం ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ రామారావు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు నిలిపివేస్తామన్నారు. పరింపూడి, పొంగుటూరు, గవరవరం గ్రామాలలోని వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వంతెన నిర్మించాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టిన్నపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఏలూరు జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండల కమిటీల ఆధ్వర్యంలో పట్టిన్నపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలని 15 కిలో మీటర్లు పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి ఎంజీవరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్ర పట్టిన్నపాలెం వంతెన వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు టి.నాగమణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర జైనవారిగూడెం, శ్రీనివాసపురం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో, టౌన్ కన్వీనర్ పసల సూర్యారావు, తామ ముత్యాలమ్మ, జి.సూర్య కిరణ్, బొడ్డు రాంబాబు, పోలోజు నాగేశ్వరరావు, జోడి సూర్యచంద్రం, అందుగుల ప్రభాకరరావు, యాగంటి సీత, వామిశెట్టి నరసరావు, ఎస్‌కే మాబు సుభాని, వంగ గోపి, పి.పోతురాజు, కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు



వైద్యశిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులు

జంగారెడ్డిగూడెం: పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. డీసీసీబీ మేనేజర్ జె.సుధాకర్, నారాయణ్ రమేష్, సొసైటీ సీఈవో ఆర్.లక్ష్మి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శ్రావణ్ చంద్రదత్, డాక్టర్ మల్‌హోత్రా, డాక్టర్ జ్యోత్స్నరాణి, డాక్టర్ స్నేహిత్‌రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హైదరాబాద్ గ్రేస్ ఫౌండేషన్, తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, జనసేన నాయకులు కరాటం సాయిబాబా, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ప్రిన్సిపాల్ కుసుమ, న్యాయవాది యూ. ఏసుబాబు, బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.